## క్లుప్తంగా

### పుస్తె, మెట్టెలు అందజేత



పుస్తె, మెట్టెలు అందిస్తున్న కృష్ణంరాజు

**ఖానాపూర్:** పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో నిరుపేద కుటుంబమైన అంజవ్వ–రాజన్న దంపతుల కూతురు గిరిజ వివాహానికి సోమవారం పుస్తె, మెట్టెలు అందజేశారు. టీకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఖానాపూర్ వాసి ఒడ్డెపల్లి కృష్ణంరాజును స్థానికులు కలిసి పేద కుటుంబం గురించి విన్నవించారు. స్పందించిన కృష్ణంరాజు పుస్తె, మెట్టెలు, పెళ్లి భోజనానికి బియ్యం, ఇతర సామగ్రి అందజేశారు.

### ‘మోసం చేసేందుకే సభ’

**ఖానాపూర్:** గతంలో కేసీఆర్ కుటుంబ పాలనలో పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్ నేతలు మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకే రజతోత్సవ సభ నిర్వహించారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ పార్టీ పేరిట ఏర్పాటై అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అణచివేసిందని విమర్శించారు.

### ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం



అభినందిస్తున్న రామకృష్ణాగౌడ్

**భైంసాటౌన్:** పట్టణంలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన పల్సి శారద, జువేకర్ శ్రీదేవి అనే ఇద్దరు విద్యార్థులు.. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో ఏఎన్ఎం ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో సోమవారం కళాశాలలో యాజమాన్యం విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ప్రసన్నరాణి, ప్రిన్సిపాల్ సాయినాథ్, అధ్యాపకులు ఉన్నారు.

### మాల సంఘం కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

**సారంగపూర్:** మండలంలోని జామ్ గ్రామంలో మాల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా మహిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా నలిమెల రాము, కోశాధికారిగా ఆకుల సాయన్న, రైటర్‌గా మొద్దోల్ల నారాయణ, ప్రధాన సలహాదారుగా అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు జంగం రవీన్ ఎన్నికయ్యారు.

### ‘అడెల్లి’ చైర్మన్‌కు సన్మానం

**సారంగపూర్:** మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సింగం భోజాగౌడ్‌ను అడెల్లి, స్వర్ణ, కౌట్ల(బి) గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రజిత, ప్రేమలత, సుధాకర్ ఉన్నారు.

### ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



పందిరి వేస్తున్న వీడీసీ సభ్యులు

**లక్ష్మణచాందా:** మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సోమవారం పుణ్యాహవచనం, అంకురార్పణం, దీక్షధారణం అనంతరం ఆలయం వద్ద పందిరి వేసి అలంకరించారు. మంగళవారం అగ్ని ప్రతాదివాసం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు, బుధవారం నిత్య హోమం, బలిప్రధానం, అష్ట భుజ వేణుగోపాలస్వామి కల్యాణం, సాయంకాలం రథోత్సవం, జాతర తదితర కార్యక్రమాలు, గురువారం ఏకాంత సేవ, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారి రాజు తెలిపారు.

### ‘ఆయిల్‌పాం’తో లాభాలు

**నర్సాపూర్(జి):** ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శేఖర్ అన్నారు. మండలంలోని గొల్లమాడ గ్రామ రైతువేదికలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్‌పాం గెల టన్నుకు రూ.21 వేలు పలుకుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# మారనున్న వారసంత అడ్డా..!

- భైంసాలో తీరనున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- పోలీస్, మున్సిపల్ శాఖల ప్రత్యేక దృష్టి
- రోడ్లపై ఆక్రమణల తొలగింపు



పట్టణంలో రోడ్డుపై ఆక్రమణలు తొలగింపజేస్తున్న మున్సిపల్, పోలీసు అధికారులు (ఫైల్)

**భైంసాటౌన్:** పట్టణంలో ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రోడ్లపై ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఇటీవల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్, పోలీస్‌శాఖల అధికారులు, సిబ్బంది కలిసి రెండురోజులుగా పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న చిరువ్యాపారుల ఆక్రమణలు తొలగింపజేస్తున్నారు.

**వారసంతతో చింత..**

పట్టణంలోని మిర్చిమార్కెట్ రోడ్డులో ప్రతి సోమవారం వారసంత ఉంటుంది. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, మహారాష్ట్ర నుంచి సైతం రైతులు, చిరువ్యాపారులు వచ్చి భైంసాలో కూరగాయలు, పండ్లు విక్రయిస్తుంటారు. వివిధ రకాల వస్తువులు కొనేందుకు సమీప ప్రాంతాల నుంచి జనం కూడా భారీగానే వస్తుంటారు. స్థానిక టిప్పు సుల్తాన్ చౌక్ నుంచి మిర్చిమార్కెట్ వరకు కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. కూరగాయలు కొనేందుకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. ప్యాసింజర్ల కోసం ఆటోలు అక్కడే వేచి ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో ప్రతి సోమవారం ప్రత్యేకంగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

**మార్చేందుకు చిరువ్యాపారులతో సమావేశం..**

మిర్చి మార్కెట్ రోడ్డులోని వారసంతను కాటన్ మార్కెట్‌యార్డులోకి మార్చాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై పట్టణంలోని పలువురు కూరగాయల వ్యాపారులతో మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఉదయం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను గాంధీగంజ్ లోపల, సోమవారం వారసంతను కాటన్ యార్డులోకి మార్చడంపై చర్చించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టేలా వీధి వ్యాపారులు, కూరగాయల విక్రేతలు సహకరించాలని కోరారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించుకుని సామగ్రి పెట్టుకుంటున్నారు. దీంతో రెండు రోజులుగా అధికారులు దుకాణాల ఎదుట సామగ్రి తొలగింపజేస్తున్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**స్థలాలు ఆక్రమించి, అద్దెకిచ్చి..**

కొందరు రోడ్డు పక్క స్థలాలు ఆక్రమించి తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. బస్టాండ్ నుంచి మున్సిపల్ మార్గంలో, మిర్చియార్డు మార్గంలో, మహాలక్ష్మి మందిర్ మార్కెట్ ప్రాంతంలో రోడ్డు పక్కన కొందరు షెడ్లు ఏర్పాటు చేసుకొని అద్దెలకు ఇస్తున్నట్లు తెలిసింది. అలాగే, కొందరు దుకాణదారులు తమ దుకాణాల ఎదుట చిరువ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓవైపు మున్సిపల్‌కు తైబజార్ రూపంలో చెల్లిస్తున్నా.. దుకాణదారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు రోడ్ల పక్కన తాత్కాలిక షెడ్లు తొలగించి దుకాణాల ఎదుట చిరువ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**రోడ్లపై ఆక్రమణలు వద్దు**

దుకాణదారులు, చిరువ్యాపారులు రోడ్లపైకి వచ్చేలా సామగ్రి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. అదనపు కలెక్టర్ ఆదేశాలనుసారం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందరూ సహకరించాలి. – బి.రాజేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, భైంసా

**ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా..**

పట్టణంలో వీధి వ్యాపారులు, చిరువ్యాపారులు తమ సామగ్రిని రోడ్లపై ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోడ్లపక్కన ఆక్రమణలు తొలగింపజేస్తున్నాం. వారసంత అడ్డాను మరోచోటకు మార్చాలని వీధివ్యాపారుల కమిటీతో చర్చించాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వీధివ్యాపారులు, కూరగాయల విక్రేతలు సహకరించాలి. – జి.గోపీనాథ్, పట్టణ సీఐ, భైంసా

# చెరువుకు మరమ్మతులు చేయిస్తా



ఎల్లమ్మ చెరువు వద్ద అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

**కుభీర్:** మండలకేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టకు మరమ్మతులు చేయిస్తానని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల కిందట భారీవర్షాలకు చెరువు కట్ట తెగిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మరమ్మతులు చేయించకపోవడంతో నీళ్లు నిల్వ ఉండటం లేదు. రైతులు, మత్స్యకారుల వినతి మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి చెరువు పరిశీలించారు. తమ బోరుబావులు ఎండిపోయాయని రైతులు.. తమకు ఉపాధి దూరమైందని మత్స్యకారులు తెలిపారు. ఈసందర్భంగా విఠల్‌రెడ్డి ఫోన్‌లో అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# భూభారతి చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న కుంటాల తహసీల్దార్ కమల్‌సింగ్

**కుంటాల:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి భూభారతి చట్టంతో రైతుల భూసమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కల్లూరు గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు అడెల్లు, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి భోజన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**నర్సాపూర్(జి):** మండలంలోని కుస్లీ, అర్లి(కే) గ్రామాల్లో సోమవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను తహసీల్దార్ శ్రీనివాస్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సుమలత, నవతజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### హామీ నెరవేర్చిన మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యేను కలిసిన బాధితులు

**కుంటాల:** మండలంలోని ఓలా గ్రామంలో వడ్రంగి పని చేసే వేల్పూర్ రాకేశ్, రంజిత్, రాజశేఖర్‌కు చెందిన షెడ్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైన విషయం తెలిసిందే. ఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ బాధితులను పరామర్శించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయి. దీంతో సోమవారం మాజీ ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మంజూరు పత్రాలు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, నాయకులు ఎండీ యూనుస్, అమృత్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపరిరక్షణ అందరి బాధ్యత



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

**కుభీర్:** ధర్మపరిరక్షణ అందరి బాధ్యత అని.. మన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాలని హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం కుభీర్ విఠలేశ్వరస్వామి మందిరంలో 108గుండాలతో హనుమాన్ మహాయజ్ఞం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో హిందువులపై దాడులు పెరుగుతున్నాయని.. భూమాత, గో మాత, గంగామాతను రక్షిస్తూ అందరూ ఐక్యంగా ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు.. తమ పిల్లలకు మంచి సంస్కారం ఇవ్వాలనిన్నారు. అంతకుముందు అర్ధ మండల దీక్ష చేసేవారికి మాల వేశారు. అంతకుముందు ఉదయం హనుమాన్ స్వాములు నగర సంకీర్తన చేశారు. ఈసందర్భంగా అభిషేకం, అర్చన,కలశపూజ, నాగావళి, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుణ్యదంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### ‘బీజేపీతోనే అభివృద్ధి’



ధర్మాజీపేట్‌లో ఎన్నికైన బూత్ కమిటీ కార్యవర్గం

**కడెం:** బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో రెండు బూత్ కమిటీలకు అధ్యక్షులుగా రమేశ్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు క్లెం రమణారెడ్డి, కర్ణాటక భీమన్న, సత్తెన్న, నల్లగొండ, గోపి, తదితరులున్నారు.

**బూత్ కమిటీల ఎన్నిక**

**ఖానాపూర్:** మండలంలోని దిలావర్‌పూర్, పాత ఎల్లాపూర్ గ్రామాల్లోని 194, 191వబూత్ కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ తెలిపారు. దిలావర్‌పూర్ అధ్యక్షుడిగా గోనె శ్రీనివాస్, కార్యదర్శిగా గుగ్గిళ్ల శేఖర్‌గౌడ్, పాతఎల్లాపూర్ అధ్యక్షుడిగా ఎత్తెరి పుల్లయ్య, కార్యదర్శిగా దండుగుల చిన్న భీమేశ్ ఎన్నికయ్యారని తెలిపారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

**సోన్:** కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సోమవారం మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వీడీసీ సభ్యులు, గ్రామస్తులు బస్టాండ్ వద్ద మృతులకు సంతాపం పాటించారు. సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, పోలీసులు బందోబస్తు నిర్వహించగా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదం జరిగేదాకా చూస్తారా?



**భైంసారూరల్:** మండలంలోని చుచుంద్ గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చేతికి అందే ఎత్తులో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని.. ప్రమాదం జరగకముందే అధికారులు దీని చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



మల్లాపూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న భీమ్‌రెడ్డి



న్యూవెల్మల్‌లో ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేందర్

**లక్ష్మణచాందా:** రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోకుండా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని మద్దతు ధర పొందాలని నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

**సోన్:** మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా రైతుసేవా సహకార సంఘం లిమిటెడ్ (ఎఫ్ఎస్‌సీఎస్) చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్ ప్రారంభించారు. ఏఈఓ ఉమామహేశ్వరి, వీడీసీ చైర్మన్ రొడ్డ రాజేశ్వర్, గజ్జల గంగాధర్, తోట సాయన్న, బొల్లి దయాకర్, నిర్వాహకులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

**భైంసారూరల్:** మండలంలోని వాలేగాం గ్రామంలో సోమవారం ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చాకెటి లస్మన్న, మాజీ ఎంపీపీ రజాక్, రమణారెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందించాలి



కుంటాలలో సర్వే చేస్తున్న అధికారులు

**ఖానాపూర్:** పట్టణంలోని 12వ వార్డు పరిధి సుభాశ్‌నగర్‌లో సోమవారం ఇందిరమ్మ కమిటీ చైర్మన్ షబ్బీర్‌పాషా ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమయ్యారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి అర్హులను ఎంపిక చేయాలని చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు సలీంఖాన్, అయూబ్, మీర్జా బేగ్, రవి, సీతారాం, లక్ష్మి, సరోజ, వార్డు అధికారి సంతోష్, మెప్మా సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

**అర్హులను ఎంపిక చేయకనే..**

**ముధోల్:** కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించాలని బీఆర్ఎస్ నాయకులు విఠల్‌కాంబ్లే అన్నారు. సోమవారం ముధోల్‌కు వచ్చిన ఇళ్ల పరిశీలన అధికారి రవీందర్‌తో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

**కుంటాల:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపికకు సోమవారం అధికారులు సర్వే చేశారు. దరఖాస్తుదారుల ఇళ్లు, పట్టావివరాలను సేకరించారు. సర్వేలో ఎంపీడీవో లింబాద్రి, ప్రత్యేక అధికారి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్(జి):** మండలంలోని నర్సాపూర్ (జి)లో ఎంపీఓ తిరుపతిరెడ్డి, రాంపూర్, తిమ్మాపూర్(జి) గ్రామాల్లో ఏవో రాంచందర్ నాయక్, తురాటిలో ఎంపీడీవో పుష్పలత సోమవారం ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నవనీత్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

## ఈరోజు

### విద్యుత్ సరఫరా బంద్

**భైంసాటౌన్:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సంతోషిమాత, ధననివాలా సబ్‌స్టేషన్ల పరిధి 11కేవి ఫీడర్స్ నిర్మల్‌రోడ్, ఓవైసీనగర్, పల్సి ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్, భట్టిగల్లి, పురాణబజార్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### సామాజిక తనిఖీ ప్రజావేదిక

**సారంగపూర్:** ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25లో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలను సామాజిక తనిఖీ బృందాలు వెల్లడిస్తాయని వివరించారు. అన్ని గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.

# ‘వరి ధాన్యం దోపిడీని అరికట్టాలి’



నిరసన తెలుపుతున్న రైతులు

**దస్తురాబాద్:** రైస్ మిల్లు యజమానుల ధాన్యం దోపిడీని అరికట్టాలని సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక ఎదుట వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాకుని తిరుపతి, నూతన్‌కుమార్ మాట్లాడుతూ దస్తురాబాద్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతులు వరిధాన్యం విక్రయిస్తే బస్తాకు 42 కిలోలతో తూకంవేసి కుంటాలలోని శ్రీ ఆంజనేయ రైస్‌మిల్‌కు తరలిస్తే 43 కిలోలతో తూకం వేసిన ధాన్యాన్నే తీసుకుంటామని, లేదంటే 3 కిలోల తరుగుతో అన్‌లోడ్ చేసుకుంటామని రైతులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారన్నారు. అధికారులు విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. రాములు, లింబాద్రి, గంగాధర్, ఆశన్న, రవీందర్, రాజన్న పాల్గొన్నారు.

### ‘ఇల్లు ఇవ్వకుంటే ఆత్మహత్యే’

**తానూరు:** తమకు అర్హతలున్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాలో తమ పేరు రాలేదని.. ఇల్లు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని మండలంలోని బెల్‌తరోడా గ్రామానికి చెందిన పి.విజయ్‌కుమార్ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సోమవారం అధికారులు అర్హుల సర్వే నిర్వహించగా తన పేరు లేకపోవడంతో విజయ్‌కుమార్ ఆందోళన చెందాడు. నాకు సొంతిల్లు లేక అద్దెకు ఉంటున్నానని.. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అర్హుల జాబితాలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమ పేర్లు రాసుకొని నా పేరు విస్మరించారని భావోద్వేగానికి గురయ్యాడు. నా ఆత్మహత్యకు కారణం ఇందిరమ్మ కమిటీ సభ్యులని మాట్లాడిన వీడియో వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొడుతోంది.

### ఘనంగా బీరప్ప కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

**సారంగపూర్:** మండలంలోని జామ్ గ్రామంలో సోమవారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప– కామరాతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప ఆలయ ప్రాంగణంలో కుర్మసంఘం పెద్దలు, పూజారులు గొర్రెల మందలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేస్తే పశుసంపద వృద్ధి చెందుతుందని వారి నమ్మకం. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.